# 29. పళ్ళతోట చేరాలంటే ముళ్ళబాట దాటాల్సిందే!

**ట**ర్నింగ్‌లో కారు పార్కు చేశాక ఉత్తరం మరోసారి చదువుకుంది రాధ. "నాన్నా ఇది నువ్వు ఎరగని వ్యవహారం. ఎదురుచూడని ఉత్తరం ఇంకెందుకు? అసలు విషయానికి వస్తున్నాను. విను కాంట్రాక్టు పనులూ వ్యవహారాలూ ఎక్కువై గత రెండేళ్ళుగా నువ్వు ఊళ్ళమ్మట తిరుగుతూ బొత్తిగా ఇంటిపట్టున ఉండడం లేదు. నువ్వు లేనప్పుడు నీ యీ కూతురు రాధాబేబీ ఎంతగా దిగజారిపోయిందో నువ్వు ఊహించలేవు.

గుండె బండరాయి చేసుకొని, సిగ్గు వదులుకొని నీకిది రాస్తున్నాను. ఇప్పుడైనా చెప్పక తప్పదు గనక. ఏ ఆడపిల్లయినా తనంత తానుగా చెడిపోయానని బయటపడదు. అందునా తండ్రి ముందు! కాని ఏం చెయ్యను!

చెడిపోవడం అంటే అలా ఇలా కాదు. ఒక్కరో ఇద్దరో కాదు! ఈ సంగతి ఇంకొకరి ద్వారా నీకు చేరడం ఇష్టంలేక నేనే తెలియజేస్తున్నాను. నా గుట్టు బయటపడిపోయింది. రైడ్సు జరిగేటంత వరకు వచ్చింది. ఇక పోలీసు రికార్డుల్లో ఎక్కడమే తరువాయి. ఎంతో కష్టపడి పేరు పైకి పొక్కకుండా తొక్కిపెట్టేను. ఇంకా నేనిక్కడుంటే నాతోపాటు నీకూ తమ్ముళ్ళకూ పరువు దక్కదు.

రక్తం రుచిమరిగిన మాఫియా పులులు ఇవి. ఏ పరిస్థితుల్లోనూ నన్నిక్కడ వీళ్ళు ఉండనివ్వరు. నేనెలాగో నాశనమైపోయాను గనక మన ఇంటిపరువైనా నిలబెట్టాలని మారుపేరుతో ఇక్కణ్ణుంచి దాటేస్తున్నాను. నీకీ ఉత్తరం అందేసరికి ఏ ఎయిర్‌డ్రోమ్‌లో ఉంటానో... ఏ అబుదాబీలోనో ఏ అమీనా బీబీగా అసహ్యమైన వృత్తి చేపట్టవలసి వస్తుందో... చేసుకున్నాక తప్పదు గదా...

నా నగలన్నీ కార్లోని లాకర్లో వదిలేస్తున్నాను. లాక్ చేసిన కార్ పార్కింగ్ ఏరియాలో వదిలేస్తున్నాను. నేనే వెళ్ళిపోతున్నప్పుడు ఇవన్నీ నాకెందుకు? నా కోసం వెదికించననుకునే ఇది చదువు. చదవడం పూర్తిచేశాక చింపేస్తాననుకుంటేనే చదువు. మన ఫ్యామిలీ ఫోటో ఆల్బమ్‌లో అమ్మమ్మ పక్క, అమ్మ పక్క, నా ఫోటో కూడా అతికించు. ఏం చెయ్యను. మన ఇంటి వాతావరణంలో ఆడవాళ్ళు ఇమడలేరు.. క్షమాపణలతో, నీ రాధా బేబీ."

ఇన్నేళ్ళూ కష్టపడి, ఈ నిర్ణయానికి వచ్చిన రాధలాంటి ధీమతికి ఇక వెనుదిరగడం అంటూ ఉండదు. అసలు ఆడదంటేనే చిన్నచూపు నాన్నకి. 'మొగాడనేవాడు ఊరు కొల్లగొట్టి ఇల్లు నింపాలి. ఆడదనేది ఆ ఇంటిని చక్కదిద్దుకుని ఆలనాపాలనా చూసుకోవాలి' అనే అభిప్రాయం మార్చుకోవలసిన అవసరమేమీ నాన్నకి కలగలేదు.

'మరి కన్నకూతుర్ని గ్రాడ్యుయేట్ ఎందుకు చేయించావయ్యా' అంటే ఈ కాలపు పెళ్ళికూతురికి అది కనీస యోగ్యత కనక.

మాంచి పొడుగూ, తెల్లటి తెలుపూ, చక్కని ముఖకవళికలూ తన కూతురికి ఎలాగూ

ఉన్నాయి. మంచి మార్కులతో బియ్యే ఎకనామిక్స్ ఎప్పుడో పాసయింది. రెండు లక్షల కట్నం ఎడంచేత్తో పారేయ్యడానికి రామ్మూర్తి రెడీగా ఉన్నాడు. ఇక మేం చేసుకుంటామంటే మేం చేసుకుంటామని పెళ్ళికొడుకులు ఎగబడడంలో ఆశ్చర్యమేముంది! ఈ మధ్య పోస్టుగ్రాడ్యుయేషన్ కూడా చేసింది కదా!

కూతురే గాక ఇద్దరు కొడుకులూ చూడముచ్చటగా ఎదుగుతున్నారు. బాగా చదువుకొని పైపైకి వస్తున్నారు. అతని భార్య సీతమ్మ బతికుండేదాకా ఈ యింటి వాతావరణం కాస్త తేడాగా ఉండేదేమో గాని ఏ ముఖ్య విషయంలోనూ ఆవిడ మాటపడనివ్వలేదు రామ్మూర్తి. తనమాట చెల్లదని గ్రహించిన ఆమె, అతన్తో ఎడ్జస్టయిపోయింది.

మంచి సంబంధం వచ్చేదాకా ఊరికే కూచోపెట్టడమెందుకని ఎమ్మే సోషల్ వర్క్‌లో కూతురు సీటు తెచ్చుకుంటే అడ్డు చెప్పలేదు రామ్మూర్తి.

తల్లీ తండ్రీ ఇచ్చిన పాకెట్‌మనీ ఎప్పటికప్పుడు తమ్ముళ్ళకి ఇచ్చేసేది. పెద్దవాళ్ళకి చెబితే దెబ్బలాడుతారని చాటుగా తన లాగులూ, గౌన్లూ పనిపిల్లకి ఇచ్చేసేది. ఇంతప్పట్నుంచి తన పని తనే చేసుకోవడం ఇష్టం.

పైగా తమ్ముళ్ళకి పుస్తకాలకి అట్టలు వేసి పెట్టేది. నోట్సు రాసిపెట్టేది. వంటమనిషి రాకపోతే తల్లికి వంటపనిలో ఎంతో సహాయం చేసేది.

'ఇంటికి పెద్దదీ ఆడపిల్లా లేదా పోదా, రోజుకో రకం బట్టా, నగా పెట్టుకుంటే చూడాలని ఉంటుంది. ఏమిటండీ దీనికి ఏ సరదాలేదూ?' అని సీతమ్మ మొగుడితో కంప్లయింట్ చేస్తే, 'బావుంది నీ అదృష్టం బాగుండి బాగా ఉన్న వాళ్ళయింట్లో నువ్వు కాలు పెట్టేవు. మన హోదాతో పోల్చుకుంటే మీ పుట్టింటివారికున్న భోగభాగ్యాలేమిటీ, అత్తెసరు బతుకులు తప్ప! ఎప్పుడో పుణ్యం చేసుకొని ఈ ఇంట్లో పడింది గాని రాధాబేబీకి మీ వాళ్ళ ఆ కొద్ది బుద్ధులు ఎక్కడికిపోతాయ్!' అని దెప్పేవాడు.

నిజానికి తల్లి తరపువాళ్ళవి ఎలాంటి బుద్ధులో రాధకి పదేళ్ళు ఉన్నప్పుడు కాబోలు, ఓ చిన్న సంఘటన తెలియజెప్పింది. ఇంకా అప్పుడు రాధకి చిన్న తమ్ముడు పుట్టలేదు. "ఇది పురుడు కదా.... ఆనవాయితీ ప్రకారం మా పుట్టింట్లో పోసుకుంటానండీ" అని సీతమ్మ ఇంకా అననే లేదు రామ్మూర్తి ఇంతెత్తున లేచాడు.

"ఆనవాయితీలూ, అట్టహాసాలూ ఎవరికి, బాగా ఉన్నవాళ్ళకి! ఆ పల్లెటూళ్ళో ఆ గోచీపాత రాయుళ్ళు నీకేం పెట్టగలరు? ఏమంటూ బయల్దేరుతున్నావ్?" అని మరి మాటాడకుండా నోరు నొక్కేశాడు.

"ఈసారి నాకు అంత ధైర్యంగా ఉండడం లేదు. పోనీ మా అమ్మనే ఇక్కడికి పిలిపించుకుంటానండీ" అని మొగుడి కాళ్ళావేళ్ళాపడింది సీతమ్మ.

మావగారు చనిపోయాక బావమరిది పంచ చేరిన అత్తగారు లచ్చమ్మగారంటే రామ్మూర్తికి

మరీ చిన్నచూపు.

"ఎంత కన్నతల్లయితే మాత్రం, ఏనాడో ఇక్కడికి వచ్చేశావ్. వాళ్ళ ఆచారాలూ, అలవాట్లూ బొత్తిగా అనాగరికం. ఆవిడగారు ఇక్కడకొచ్చి అందించే సేవ ఏమిటో" - అని నానా హేళనా చేసి, ఆఖరికి ఎలాగో తప్పక ఒడంబడ్డాడు.

"చూడు రాధాబేబీ.... నాకా తీరిక ఉండి చావదు. నీ తమ్ముడు చూస్తే ఇంకా లొడితెడు వెధవ. మీ అమ్మ చూస్తే ఇంకో నెలరోజుల్లో పురిటికి సిద్ధమయ్యేలా ఉంది. ఈమధ్య మరీ ఆయాసం అంటూ మంచం దిగడం లేదు. ఆవిడ గోల పడలేక మీ అమ్మమ్మని పిలిపిస్తున్నాను. మీ అమ్మ దగ్గర అంటే నొచ్చుకుంటుంది. వాళ్ళా బొత్తిగా కటకటపడుతున్నవాళ్ళు. మనింట్లోనా అన్నీ ఖరీదైన వస్తువులు. బీదతనం ఎంత పనైనా చేయిస్తుంది బేబీ.... నీకిప్పుడు సెలవులేగా... ఎందుకైనా మంచిది మీ అమ్మమ్మని ఓ కంట కనిపెడుతూ ఉండు తల్లీ" అని రామ్మూర్తి రాధకి పదే పదే బ్రెయిన్ వాష్ చేశాడు.

పదేళ్ళ పార్మేటివ్ ఏజ్‌లో పితృవాక్య పరిపాలన చేసిన రాధ నిశిత దృష్టికి వాళ్ళమ్మమ్మని ఓ కంట కనిపెడుతూ ఉండడంతో ఎన్నెన్నో కొత్త విషయాలు కనిపించాయి.

"ఇప్పటి ఆసుపత్రి సుకుమారపు పురుళ్ళు మేం ఎరుగమమ్మా! ఇంకో అరగంటకి పురుడొస్తుందనగా కూడా అలా ఏదో ఏ పని చేసుకుంటూనే ఉండేవాళ్ళం. ఇలా ఓ రెండునొప్పు లొచ్చేవి. అంతే, పర్సులోంచి పావలా కాసు తీసినంత సుళువుగా పిల్ల ఇవతలకొచ్చేసేది!" అని అమ్మమ్మ చెబుతూండేదని అమ్మ చెప్పేది.

అందుకే కాబోలు అందులో అల్లుడు కూడా ఏదో క్యాంపు పనిమీద ఊర్లో లేకపోవడం చూసి కూడా అయి ఉండొచ్చు. అమ్మమ్మ లచ్చమ్మ వస్తూనే వంటమనిషికి ఉద్వాసన చెప్పేసింది.

"అమ్మా, అమ్మా మీ అల్లుడుగారు తిడతారే"

"తిడితే తిట్టనీ పడతాను. నేనేం తప్పుపని చెయ్యలేదు. 'ఇంట్లో వాళ్ళలా పనిచేసేవాళ్ళే. పై వాళ్ళల్లా భోంచేసేవాళ్ళే ఉంటారటే!' ఇన్నాళ్ళకి నా చేత్తో నా మనవలకి పెట్టుకునే అదృష్టం కలిగింది. అందులో నువ్వు వట్టిమనిషికి కూడా కాకపోతివి. నీకు బెల్లం మిఠాయి ఇష్టం. పెరుగ్గారెలు ప్రాణం. ఈ మాత్రం చేసిపెట్టకపోతే నేనెందుకు వచ్చినట్టే?" అంటూ మొదలెట్టేది.

అయిదు నిముషాలైనా కూచోకుండా అలా ఏదో ఒకపని చేస్తూనే ఉండేది. అదేమి చిత్రమో, ఎన్ని పనులు చక్కబెట్టినా ఆవిడకెప్పుడూ తీరికే. ఆనాటి మనుషుల దగ్గర ఈనాటి మిషన్లు ఏం పనికొస్తాయ్. వీటికేం బుర్రా, బుర్రా? అనిపించేది అమ్మమ్మ పనితీరు దగ్గరుండి గమనించిన రాధకి.

"మీరేమనుకుంటే అనుకోండి. నా పద్ధతులు నావే" అంటూ లచ్చమ్మగారు కూతురి ప్రసవానికి ముందు ఏర్పాట్లు కూడా ప్రారంభించింది. ఎక్కళ్ళేని పాతగుడ్డలూ పోగుచేసి, శుభ్రంగా ఉతికి ఆరేసి మడతలు పెట్టి, ఓ మేటెడు తయారుచేసింది.

పాతబియ్యంట, ఓ పావుబస్తా సిద్ధం చేయించింది. వెన్నకాచిన నెయ్యిట, ఏవో పిప్పళ్ళు,

శొంఠిట, కాయం సామాన్లట. తెప్పించి జాగ్రత్త చేసింది. పుట్టబోయే పిల్లకోసం ఇంతింత బొంతలు కూడా స్వయంగా కుట్టి దాచింది. ఏం చేస్తున్నా ఆ నోటిలో ఏదో పద్యమో, పాటో!

ఇంత ముసల్దయినా ఇంత తక్కువ కాలంలో ఇన్ని ఎక్కువ పనులు చెయ్యడం తగునా! అన్నట్టు ఇలా పోర్టికోలో అల్లుడి కారు ఆగడమేమిటి ఇటు సంధ్యాదీపం పెట్టుకుందామని తలస్నానం చేస్తున్న లచ్చుమ్మగారు నూతిగట్టున కాలుజారి భళ్ళున పడడమేమిటి, ఓసారే జరిగింది. ఇంకా కూతురికి పురుడు రానేలేదు. సాయానికి వచ్చిన తల్లిని ఆసుపత్రికి సాయం పట్టవలసి వచ్చింది!

ఒకేఒక వారంరోజుల పాటు అమ్మమ్మకు తోడుగా హాస్పిటల్‌లో గడిపింది రాధ. అయితేనేం పదేళ్ళ ఆ బాలిక లేత హృదయంలో శాశ్వత ప్రభావం చూపిన అతి విలువైన రోజులవి.

మొదట్లో ఆ మూలుగులూ, ఆ మందుల వాసనలూ ఆ రోగిష్టి ముఖాలూ ఆమెకెంతో భయాన్ని కలిగించాయి.

అయితే ఓ లావుపాటి నర్సమ్మ అక్కడికొచ్చి చూపించిన ఔదార్యం ఇన్నాళ్ళూ ఎరగందేదో ఇక్కడే ఉందనిపించింది. లావేకాక నర్సమ్మ నల్లటి నలుపు కూడాను. కాని ఏవేళ చూసినా ఎక్కడా మరకలేని తెల్లటి బట్టలు వేసుకుంటుంది.

ఆ నల్లటి మొహంలో తెల్లటి పళ్ళు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఆ కళ్ళల్లో కాంతి కూడా కొట్టొచ్చినట్టు ఉంటుంది. లోకంలో సూర్యకిరణాలూ వాన చినుకులూ కూడా కొట్టొచ్చినట్టే ఉంటాయి. నిష్కల్మషమైన మనిషి సేవాధర్మం కూడా ఎటువంటి అరమరిక అభ్యంతరాలూ లేకుండా కొట్టొచ్చినట్టే ఉంటుందని రాధ ఆ నర్సమ్మని చూసే పోల్చుకుంది. బాధపడుతున్న మనుషులందరూ వేదన పోగొట్టుకొనేది అలాంటి సేవికల చల్లని ఒడిలోనే.

స్పృహలేని పరిస్థితిలోనే ఆవిడనక్కడ చేర్చడం జరిగింది. తెలివి వచ్చేసరికి, విషయం పోల్చుకుని, కూచిపూడి మొదలెట్టబోయింది!

"నా కూతుర్ని పిలిపించండ్రోయ్, నా ధర్మం అంతా మంటగలసి పోయిందర్రోయ్" అంటూ వీరంగం మొదలెట్టింది. ఆ హడావిడికి పెద్దడాక్టరు గారు వచ్చి నోరెత్తితే మత్తు ఇంజక్షనిస్తానని బెదిరించి వెళ్ళవలసి వచ్చింది.

నల్ల నర్సమ్మని దగ్గిరగా పిలిచి "ఇలాంటి స్పెషల్ కేసు నువ్వే డీల్ చెయ్యగలవు. మిగిలిన వార్డుల్లో తక్కినవారిని పోస్టు చేస్తాను. ఆపరేషనై మళ్ళీ ఈ బోడెమ్మ ఇల్లు చేరేదాకా నువ్వీ బెడ్ వదలకు" అంటూ స్పెషల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి మరీ వెళ్ళింది.

"అదేమిటి మామ్మగారూ ఏడుస్తున్నారా? ఈ వయసులో కూడా టెన్నిస్ బాల్‌లా ఉన్నారు మీరు. మీలో సగం వయస్సు కూడా లేని నేను చింతమొద్దులా కదల్లేకుండా ఉన్నాను. ఎవరు ఏడవాలి, మీరా, నేనా?"

"ఏం చెయ్యనే అమ్మా, బాధ భరించలేకుండా ఉన్నానే. చచ్చిపోయినా బావుణ్ణే. నేనేమైనా

అయితే ఈ రోజుల్లో ఎవరు చేస్తారే"

"ఛ... ఎంతమాటన్నారు మామ్మగారూ! తన పెళ్ళి మీ చేతుల మీద జరక్కుండా, మీరెక్కడ గుటుక్కుమంటారో అని అదిగో మీ మనవరాలు కాబోలు, ఆ పసిపిల్ల, గుడ్లనిండా నీరు ఎలా నింపుకుంటుందో చూడండి!"

"మరేం చెయ్యనే అమ్మా! కాలు పీకేస్తోందే... మళ్ళీ ఇది మామూలుగా అవుతుందంటావా?"

"ఇదీ ఓ దెబ్బేనా? అందులో ఈ రోజుల్లో వైద్యానికి లొంగనిదంటూ ఉంటుందా? విరిగిన ఎముకల్ని సరిచెయ్యడంలో దేశం మీదే పేరుపొందిన ఆసుపత్రి మాది. ఈమధ్యన బస్సుకింద పడి కాళ్ళు పిప్పిపిప్పి అయిన వాడొకడిక్కడ చేరేడు."

"అయితే ఏమయిందే?"

"అలా అడగండి చెబుతాను. ఆర్నెల్లిక్కడ ఉంచి అన్నీ సరిచేసి పంపించాం. కుప్పిగెంతులూ వేసుకుంటూ వెళ్లేడనుకోండి."

"అమ్మయ్యో, ఆర్నెల్లే?"

"అంతగా నలిగిపోయాయి గనక అన్ని ఆపరేషన్లు చెయ్యవలసి వచ్చింది. అయినా ఇక్కడికొచ్చే వాళ్ళలో చాలామందికి బీపీ సుగరూ లాంటివి ఉంటాయి. అవన్నీ సరిచేస్తేగాని ఆపరేషన్ టేబిల్ ఎక్కించం. మీకూ అన్ని పరీక్షలూ చేశాం. రిపోర్టులొచ్చేశాయి. చూపించనా?"

"ఎందుకే అమ్మా, అవన్నీ చూస్తే నాకు భయమే"

"మీకెందుకా భయం? ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండడం చేత కాబోలు మీ శరీర భాగాలన్నీ పెర్‌ఫెక్ట్‌గా ఉన్నాయి. శరీరాన్ని అదుపులో ఉంచుకోలేక నానాగడ్డీ తిని, తెగ పెంచుకున్న మాలాంటి వాళ్ళం భయపడాలి గాని!"

మనసు విధించిన కట్టుబాట్లు మరిచిపోయి ఆ నర్సుని ఆ క్షణమే దగ్గిరగా కూచో పెట్టుకొని వీపు నిమిరింది లచ్చమ్మ. అంతలో ఏ తప్పు తోచిందో ఆ చెయ్యి వెనక్కి తీసేసుకుంది. "మా వాళ్ళలో కూడా నీలాంటి వాళ్ళుంటే ఎంత బావుణ్ణే అమ్మా" అనేసింది అప్రయత్నంగా.

అనుకున్నట్టే లచ్చమ్మగారి కాలు, చిన్న శస్త్రచికిత్సలాంటి దానికి లొంగి, వచ్చిన వారంరోజులకి ఇంచుమించు మామూలుగా తయారైంది.

ఇన్నాళ్ళూ ఆవిణ్ణి నర్సమ్మ కంటికిరెప్పలా చూసుకుంది. ఎన్నెన్నో ధైర్యవచనాలు చెప్పి ముసలావిడ అతి త్వరగా కోలుకునేలా చేసింది.

ఇంటి దగ్గర అమ్మ చూస్తే ఇల్లు కదలలేని స్థితిలో ఉంది. నాన్న చూడబోతే 'అదంతా అమ్మమ్మ కావాలని తెచ్చుకున్నట్టు' తిట్టిపోస్తున్నాడు. వదల్లేక తను కూడా వచ్చింది గాని చిన్నపిల్ల ఏం చెయ్యగలదు!

మరో దిక్కులేని దురవస్థలో, బతుకంతా ఇక కుంటిగా ఈడ్చవలసి వస్తుందేమో అనే ఒక

ముసలిదాని బెంగలో, 'నీకేం ఫరవాలేదు నేనున్నాను' అని ధైర్యం చెప్పే ఎవరైనా ఆత్మీయులే కదా!

ఆ చిన్నవయసులోనే ఆ సంఘటన రాధ జీవితం మీద బలమైన ముద్రవేసింది.

లేకపోతే డిశ్చార్జి అయిపోయి ఆసుపత్రి గేటు దగ్గర ఇక రిక్షా ఎక్కి వెళ్ళిపోదామనుకుంటున్న అమ్మమ్మ, కూడా వచ్చిన ఆ నర్సుని దగ్గిరకి తీసుకొని ముద్దు పెట్టుకోడమేమిటి, కళ్ళనీళ్ళతో!

అంతేనా? చటుక్కున కొంగుముడి విప్పి అందులోంచి నలిగిపోయిన ఓ నోటు మడత తీసి విప్పి "మనవడి బారసాలకి మా సీత చేతిలో ఏదైనా పెడదామని ఎన్నిరోజుల్నుంచో కూడబెడితే ఈ వందా అయింది. తీరా చచ్చేలాపడి, ఇలా ఒంటికి తెచ్చుకున్నాను గదా.... ఎప్పుడూ ఎరగని దాన్నేమో, ఆ నొప్పి భరించలేక ఏమైపోతానో అని వెర్రిబెంగ పట్టుకుందే అమ్మా! నేనెలా వచ్చిందాన్ని అలా కులాసాగా ఇంటికి వెళ్ళిపోతే ఇంకో పదహారు చేర్చి వెంకట్రమణమూర్తి హుండీలో నూటపదహార్లు వేద్దామని మొక్కుకున్నానే అమ్మా! అయితే ఇప్పుడేమనిపిస్తోందో తెలుసా?"

"చెప్పండి మామ్మగారూ!"

"నాకు మరెవరూ ఆనడం లేదు. నన్ను మళ్ళీ మనిషిని చేసినదానివి నువ్వే. నీ రుణం ఎలాగా తీర్చుకోలేను. ఈ వందా తీసుకుని ఏదైనా కొనుక్కో అమ్మా... కాదంటే నన్ను చంపుకు తిన్నట్టే..."

ఆ నోటు తీసుకుంది నర్సమ్మ.

"నేనూ ఒకటి ఇస్తాను కాదనకూడదు. ప్రేమ అనేది ఒన్‌వే ట్రాఫిక్ కాదు. మీరంటే ఇష్టం గౌరవం కలిగింది గనకనే ఆ మాత్రం చెయ్యగలిగాను. నాకేం మీరు తక్కువ తృప్తి ఇవ్వలేదు. ఈ మనోబలంతో మరెందరికైనా సేవ చెయ్యగలను. నేనో పదహారు కలిపి ఇస్తున్నాను. మీరనుకున్నట్టు తప్పకుండా నూట పదహార్లు తిరుపతి వెళ్ళి వెయ్యండి. ఎవరి విశ్వాసం వారిది. దాన్ని గౌరవించడంలోనే మానవత్వముంది. ఊఁ తీసుకోండి" అంది.

తిరిగి ఆమె ఇచ్చింది కూడా కలిపి తీసుకోడానికి అమ్మమ్మ ఎంతమాత్రం ఒప్పుకోలేదు. అయితే ఆమె కూడా పట్టిన పట్టు వదల్లేదు! నర్సు అనేది అమ్మమ్మ దృష్టిలో చాలా తక్కువ జీతం సంపాదించే పరిచారిక మాత్రమే. ఆ భ్రమని నిమిషాల మీద పోగొట్టింది.

"మాకూ మంచి జీతాలిస్తారు మామ్మగారూ! పైగా మాకు పే స్కేలు ప్రత్యేకంగా, బాగా ఎక్కువగా ఉంటుంది. ఏసుప్రభువు దయ ఉండి మీలాంటి వాళ్ళకి వెన్నుతట్టి ధైర్యం చెప్పే అవకాశం ఉండాలి గాని, మాకు దేనికీ లోటుండదు. మీరిచ్చిందే మీకిస్తున్నాను. అంతేగా! ఆ ఎక్కువ ఏమైనా ఉంటే నాకే దక్కనివ్వండి"

అది తీసుకొని ఆమెని మరోసారి ముద్దుపెట్టుకుంది అమ్మమ్మ. రిక్షా కదిలి ఇంటికొచ్చింది.

ఆ వారం రోజుల అనుభవమూ రాధ మనసుని అంటిపెట్టుకుని మరి కదలను పొమ్మంది. అమ్మ ఎంత గోలపెట్టినా అమ్మమ్మని ఇక ఊళ్ళో ఉండనివ్వలేదు నాన్న. బావమరిదికి టెలిగ్రాం ఇచ్చి

అత్తగార్ని బండెక్కించేశాడు. "ఇలాంటిదానికి ఇల్లప్పజెప్పి నేను క్యాంపుకి వెళ్ళడమే తప్పు. ఇంకా ఆ పొరపాటు పొడిగించనా? ముసిల్దయితేనేమి, ఇంకా ఉక్కుముక్కలా ఉంది. ప్రయాణం చేసే స్థితిలో ఉందని డాక్టరు చెప్పేడు గనుకనే పంపించేస్తున్నాను. ఇవతల ఇంటిదాని పురుడే చూసుకోనా, ఇంతింత పిల్లల్నే పట్టుకోనా? ఇంకా ఆ ముసిల్దాన్ని పడుకోబెట్టి ఎవరు సేవ చెయ్యగలడు బాబూ? అయిదువేల చేతి చమురు వదిల్చింది. ఆసుపత్రి ఖర్చులకని... చాలు బాబూ చాలు... దీని సాయం కాదు గాని గుడ్లు పైకొస్తున్నాయి. ఈ దరిద్రప్పీనుగులతో పెట్టుకోవద్దే అంటే కట్టుకున్నది వింటేనా..." ఇలా సాగింది రామ్మూర్తి దండకం.

✪

రాధ అప్రయత్నంగా వాచీ చూసుకుంది.

అప్పుడే ఏడయిందా! ఆ అలలవైపే చూస్తూ తనలో లోపలి పొరల వైపు చూసుకుంటోంది గాని సంధ్యాకాలపు పసుపుపచ్చదనం వెన్నెల తెల్లదనంగా మారిందని కూడా ఆమె గుర్తించినట్టు లేదు. ఇంకెంత కాలమో లేదు.

అన్నీ తేల్చుకునే తనిక్కడికి వచ్చింది. అవన్నీ బేరీజు వేసుకునే రాధ ఈ పని చేసింది. అందుకనే ఆనాటి అమ్మమ్మ సంఘటని అంత వివరంగా తన మనసు నెమరు వేసుకుంది. వెళ్ళే ముందు ఇంకా ఎన్నెన్ని తలుచుకోవాలో? తండ్రి ఎక్కడ తెస్తున్నాడో ఎలా ఇల్లు నింపుతున్నాడో రోజు రోజుకీ నిండిపోయే సంపదకి ఆమె స్పందన అంతంతమాత్రంగానే ఉండేది. రోజుకో ఫేషన్ దుస్తులు వేసుకొని, ఏడాదికో స్కూటరు మార్చి, తమ్ములిద్దరూ ఎంజాయ్ చేసే లైఫ్‌కి ఎందుకో రాధ దరిదాపుల్లోకి రాలేకపోయేది.

'రెండు బీరువాల పట్టుచీరలయినా మీ మమ్మీకి చాలేవి కావు. అలాంటిది ఇంటికొక్క ఆడపిల్లవి. ఆ సాదాబట్టలే వేసుకుంటావేమే! నా దర్జాకి తగిన సంబంధం ఆనాడే తెచ్చుకొని ఉంటే ఈనాడు నా కడుపున ఇలాంటి లేకిబుద్ధుల పిల్ల పుట్టి ఉండేది కాదు. ఈ చవకబారు జీన్సు ప్రభావం ఈ ఇంట్లో ఇంకెన్నాళ్ళులే! ఏ లక్షాధికారికో కట్టబెడితే వాడే చూసుకుంటాడు. ఇక మొగపిల్లలా! వాళ్ళు సాక్షాత్తూ నా కొడుకులు! అన్నీ ఖరీదైన బుద్ధులు!"

తండ్రి ఇలా ఎన్ని లెక్చెరర్లు దంచినా రాధ మొహంలో ఎటువంటి మార్పు లేకుండా వినడం అలవాటు చేసుకుంది. తండ్రి వాలకం తనకేం కొత్తకాదు గాని అతనలా ఒకవైపు మాట్లాడుతుంటే సరిగ్గా దానికి పూర్తిగా వ్యతిరేకమైన దిశలో ఆలోచించుకోవడం ఈమధ్య బాగా అలవాటు చేసుకుంది. ఈ బంగారు పంజరంలోంచి ఎంత త్వరగా ఇవతల పడదామా అని ఆమెకీ ఉంది. కాని మరో వజ్రాల పంజరంలోకి చేరడానికి మాత్రం ఆమె మనసు సిద్ధంగా లేదు.

అమ్మమ్మ ఉన్న కొద్దిరోజుల్లోనూ భాగవతంలోని పద్యాలు అలా ఏ పనిచేస్తున్నా వరసగా చదువుకుంటూ ఉండేది. అందులోని దశమస్కంధంలోని కృష్ణలీలలు ఆవిడకి ప్రత్యేకించి ఇష్టం.

అందులోని ఓ పద్యం మాత్రం కేవలం భగవంతుణ్ణి పొగడడం కాక, జీవితాన్ని కాచి వడబోసినట్టుండడం రాధకి చాలా ఆశ్చర్యం కలిగించేది.

"సంపన్నుండొరుగానలేడు"…. అంటూ మొదలయ్యే పద్యం అది. 'డబ్బున్నవాడికి జీవితం విలువ తెలీదు. తను చేసిందే సరిఅయినదని అనుకుంటాడు. దాంతో అందరినీ హింసిస్తాడు. లేనివాడో? అనేక బాధలు పడతాడు అందర్నీ సమదృష్టితో చూస్తాడు. కాబట్టి డబ్బున్న వాళ్ళ దృష్టి దోషం పోవాలంటే దారిద్ర్యం అనే అంజనం పెట్టుకోవాలి'.

ఎంత గొప్ప జీవన సత్యం అది!

చల్లగాలిలా తన మనసంతా నింపిన అమ్మమ్మ తను ఫైనలు రాస్తున్న టైములో జబ్బుపడితే అమ్మని నాన్న పంపలేదు. సరికదా ఎప్పట్లా నానా దుర్భాషలూ ఆడాడు.

ఆ తర్వాత నెల్లాళ్ళకి అమ్మమ్మ పోయిందని టెలిగ్రాం వస్తే, నాన్న అమ్మతో ఆ ఊరెళ్ళి శవదహనం దాకా ఉండి, అమ్మని తీసుకొచ్చేశాడు. అంతే!

ఇంక తనకీ నాన్నకీ మధ్యనున్న లింకు అమ్మనేది అదీ ఈ అయిదేళ్ళయి తెగిపోయి, రాధ మరీ ఒంటరిదైపోయింది.

అసలు అమ్మని తీసుకెడదామని వచ్చిన మావయ్య భంగపడి వెళ్ళిపోయిన రోజే రాధ మనసు గిలగిలా కొట్టుకుంది. నాన్న పాలనతో బానిసలా బతుకుతున్న అమ్మతో ఏం మాట్లాడి ఏం లాభం!

మనసు మరీ చికాగ్గా ఉన్నప్పుడు ఆ నర్సమ్మని కలుసుకునేది, చెప్పుకునేది. "మా అమ్మమ్మ ఎంతో చాకిరీ చేసేదని మా అమ్మ చెప్పేది. మా తాతయ్యకి గోరంత ఉద్యోగం, ఊరంత కోపమూనట. అయినా అన్నీ భరించి పిల్లల్నందర్నీ పెంచి పెద్దవాళ్ళని చేసింది.

ఇంట్లోనే కాదు, ఆ చుట్టుపక్కల ఏ కష్టమొచ్చినా వెళ్ళి ఆదుకొనేదిట. బతికినన్నాళ్ళూ, పదిమందికింత సాయం చెయ్యడం కన్నా బతుకులో పరమార్థమేముంది!

మా చిన్నతమ్ముడు పుట్టేముందు మా ఇంటికొచ్చిన వారంలోనూ ఎన్నెన్ని ఏర్పాట్లు చేసిందో నా కళ్ళతో నేను చూశాను. అలాంటిదానికి ఆ రోజుల్లో ముక్కూ మొహం ఎరుగని నువ్వే దిక్కూ దివాణం అయావు. ఇవాళ ఆవిడే మంచానపడితే కన్నకూతురికి కూడా వెళ్ళిచూసే అవకాశం లేకపోయింది. ఏం చెప్పమంటావు?" అని ఆమె ముందు వాపోతే ఆమె ఏమందో ఎప్పుడూ మరచిపోలేదు.

"కులం, మతం, ఆచారాలూ, ధర్మాలూ అనేవి కాస్సేపు పక్కనపెట్టి మామూలు మనుషులుగా ఆలోచిద్దాం. బొడ్డున మాణిక్యంతో పుట్టినదానివి నువ్వు. ఏటి ఒడ్డున ఎవరో కని పారేస్తే ఆర్ఫనేజ్‌లో పెరిగినదాన్ని నేను. దిక్కులేని ఓ ఆడపిల్లగా పుట్టి ఇన్ని మెట్లెక్కడానికి నేనెంత ఘర్షణ పడిఉంటానో నీకిప్పుడు చెప్పి లాభం లేదు. ఇన్ని చూశాక నీకు ఒకటే అనిపిస్తుంది. జన్మ ఎత్తడానికే కాక జన్మ ఇవ్వడానికి కూడా ప్రభువు అవకాశం కల్పించిన ధన్యజీవులం మనం. ఆ మాటకి అర్థం బండెడు

సంతానాన్ని భూమ్మీదకి రప్పించమని కాదు. అర్థవంతమైన ఆడపుట్టుకని సార్థకం చేసుకోమని, కారుణ్య హృదయంతో, బాధితుల కన్నీళ్ళు తుడవమని!"

"ఎలా? అదెలా?"

"అలా నువ్వు నన్నింకా అడిగే స్థితిలోనే ఉన్నావంటే నీ సంకెళ్ళని నువ్వింకా తెంపుకో లేకుండా ఉన్నావనే అర్థం!"

"సంకెళ్ళా? అవేమిటి?"

"పోలీసులకి దొంగలకి వేసేవి మాత్రమే సంకెళ్ళు కావు. తప్పు చేస్తున్నామని మనసు ఒప్పుకున్నా, ఏ మాత్రం ఎదురు తిరక్కుండా ఉన్న పరిస్థితులతో రాజీపడి శాంతియుతంగా బతుకుతున్నామనే భ్రమతో కడుపులో చల్ల కదలకుండా గడిపెయ్యడమే! ముఖ్యంగా మన ఆడాళ్ళు వాళ్ళ మటుకు వాళ్ళు వేసుకునే సంకెళ్ళవి. ఎన్నోసార్లు నన్ను కలుసుకున్నావు. ఏవేవో కబుర్లు చెబుతూ ఉంటావు. కబుర్లతో కాలక్షేపం చేస్తావు గాని కాసంతైనా కార్యోన్ముఖం కావు. ఎందుచేత? ఒక్క ప్రశ్న అడుగుతాను చెప్పు. మీ అమ్మమ్మ చాకిరీకి మీ అమ్మని పంపలేదని మీ నాన్నని తప్పు పడుతున్నావు. కరెక్టే. చదువుకున్నదానివి. చేతిలో డబ్బున్నదానివి. నువ్వెందుకు వెళ్ళేవు కాదు?"

"మా నాన్న నన్ను పంపితే కద?"

"చూశావా చూశావా, ఎలా దొరికిపోయావో! ఇన్నేళ్ళు కాపురం చేసి ముగ్గురు పిల్లల్ని కన్నా జబ్బుతో ఉన్న తల్లిని చూసి రావడానికి మీ అమ్మకి మీ నాన్న పర్మిషన్ కావాలి. 'మంచి పని చెయ్యడానికి ఇంకొకరి పర్మిషన్ ఎందుకు?' అని ఆనాటి మీ అమ్మ అనుకోలేదంటే అర్థం ఉంది. లక్షాధికారి బిడ్డవైనా, డిగ్రీ వెలిగిస్తున్నా, స్వంతకారు నడిపే స్టేటస్‌కి చేరుకున్నా, నిన్ను మీ నాన్న పంపాలి! చూడు రాధా! అణిగి మణిగి ఉండడం మన సంప్రదాయం మనకి నేర్పింది. ఇందాకే చెప్పేను ఇందులో కులం మతం ప్రసక్తి లేదని. వాళ్ళది మగ కులం. మనది ఆడకులం. వాళ్ళు యజమానులు. మనది బానిస జాతి. అధికారం చెలాయించినందుకు వాళ్ళని తప్పుపట్టి లాభం లేదు. వాళ్ళ అధికారం అదేదో పరమ పవిత్రతా ధర్మంగా శిరసావహించిన మన ఆడజాతి సిగ్గుపడాలి! ఇది కట్టుకున్న మొగుడే అక్కర్లేదు, కన్నతండ్రయినా అంతే. ఆడదాని దోపిడీకి కారణం ఎవరైతేనేం?"

"అందరూ మా నాన్నలాగే ఉంటారా?"

"ఉండరు, ఏసుక్రీస్తూ, గాంధీ వీళ్ళూ మొగాళ్ళే. కాని ప్రకృతి చూపించిన పక్షపాతం, సంఘం ఆమోదించిన ఆధిక్యం వాళ్ళలో ఎక్కువ తక్కువ బుద్ధులతో ఉండేలాగే చేస్తోంది. వాళ్ళు కల్పించిన సంకెళ్ళని అవేవో శరీర భాగాలంతగా భరించి, ఎదురు తిరగకపోవడమే మన ఆడాళ్ళ తప్పు!"

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావు?"

"ఇన్ని చెప్పినా ఇంకా నువ్వా ప్రశ్న చెప్పింది సరిగ్గా ఫాలో అవలేదనే అర్థం ఒకరు చెబితే

చేసేవి కావు. మంచికో, చెడ్డకో కలిగున్న ఇంట్లో పుట్టేవు. అందంగా ఉన్నావు. ఇవన్నీ నువ్వు కష్టపడి సాధించినవి కాదు, గనక సరియైన బాటలో నీ వ్యక్తిత్వం కాపాడుకుందామనే నీ తపన నిజంగా మెచ్చుకోతగింది. స్వచ్ఛంగా ఆలోచించగలిగే వరకూ ఎవరూ పైకి రాలేరు. స్వేచ్ఛగా ప్రతి నిమిషం చేపట్టాలి. అది ఒకరు చెప్పేది కాదు" అని అక్కడితో ఆపుచేసింది ఆమె.

వెళ్ళిపోతున్న రాధని ఆపి మరో చురక అంటించింది ఆమె.

"చూడు రాధా మన పుట్టుకా, గిట్టుకా అనేవి మన చేతుల్లో లేనివి. మనకి తెలియకుండానే జరిగిపోయేవి. ఇక ఈమధ్య నున్న జీవితం అనేది ఉంది చూశావూ, అదొక్కటే మన సొంతం. మనకిష్టమైన పద్ధతిలో దాన్ని తీర్చిదిద్దుకోవడంలోనే ఉంది మన ఘనత"

అంతే. అంతవరకూ అగమ్యగోచరంగా ఉన్న తన జీవితానికి ఓ మార్గం దొరికినట్లయింది. ఇన్నాళ్ళూ తన ఇంటి భోగభాగ్యాలతో తను తలమునకలవలేదు గాని వాటి ఆలోచనలతో విలువైన కాలాన్ని ఎంతో వేస్టు చేసుకుంది. తండ్రినీ, తమ్ముళ్ళనీ అసహ్యించుకోవడంలోనే పొద్దుపుచ్చింది. కాని దాంతో ఎంత వృధాగా గడుపుతుందో పసికట్టలేకపోయింది. తన ఈ కుటుంబ సభ్యులూ, తనింట్లో పనిచేస్తున్న ఓ అరడజను మంది సేవకులూ ఇదేనా, ఇంతేనే ప్రపంచం?

✪

రాధ మళ్ళీ వాచీ చూసుకుంది. అమ్మో, అప్పుడే ఎనిమిదిన్నర! ఈ ఊరికీ ఈ ఇంటికీ గుడ్‌బై కొట్టేద్దామని నిశ్చయించుకుంది గనక ఆ అనుభవాలన్నీ ఓసారి తిరగదోడుకుంటోంది.

విజయ్‌నగర్ కాలనీలో ఎవరో నాయుడిగారింట పెళ్ళి విందు. తననీ నాన్న రమ్మన్నాడు గాని "రాలేను నాన్నా, తలనొప్పిగా ఉంది. అలా బీచి ఒడ్డున కాస్సేపు కూచుంటాను. అన్నమయ్య కోవెల లాంటిది కొత్తగా కట్టేరు చూశావా. అక్కడ మన మారుతీలో వెయిట్ చేస్తూ ఉంటాను.

వచ్చేటప్పుడు నీ కారులో వస్తూ నన్ను పిలు. నేనూ నా కారులో నిన్ను ఫాలో అవుతాను. సరేనా? అన్నట్టు నా మారుతీకారు డూప్లికేట్ కీ నీ దగ్గరుందిగా?" అని అడిగి నాలిక కరుచుకుంది రాధ.

"ఏమిటో ఎప్పుడూ లేంది ఏవో పరాకు మాటలు మాటాడుతున్నావ్ రాధా బేబీ! ఉంటే ఉందిలే డూప్లికేటు. దాని మాట ఇప్పుడెందుకూ?"

"చెప్పేనుగా తలనొప్పి దంచేస్తోందని!"

"ఇంటికెళ్ళి ఏ శారిడానో వేసుకొని పడుకో రాదూ?"

"లేదు నాన్నా! ఇక్కడే ఈ వెన్నెల్లోనే కాస్సేపు తిరిగొస్తాను. ఎంత రాత్రైనా నా మారుతీ కారు నీకోసం చూస్తూనే ఉంటుందిగా!"

తండ్రితో కలిసి నవ్వు నటించింది రాధ.

వెళ్ళేదాకా ఆ కారుని చూస్తూనే అక్కడ నిలబడిపోయింది.

ఎంతైనా పాతికేళ్ళు పాటు పెంచి పెద్దచేసిన తండ్రి.

వెన్నెల్లో ఎగిసిపడే కెరటాన్ని చూస్తూ అక్కడే నిలబడిపోయింది. తన స్టేటస్‌కి తగిన ఫారిన్ సంబంధం జతపడక ఇన్నాళ్ళూ ఆగేడు గాని నిజంగా అదే జరిగితే ఏమవునో! తన అదృష్టం బాగుండి 'ఆసెట్'లో రేంకొచ్చి ఎమ్మే సోషల్ వర్క్‌లో తనకు సీటొచ్చింది. సాంఘిక సేవతో ముడిపడి ఉన్న ఆ కోర్సులో ఆమె మనసు అతుక్కుపోయింది కొత్తజీవితం మొదలెట్టినట్లయింది.

మొట్టమొదటి సెమినార్‌లోనే రాధ ఫీల్డ్ వర్క్ కస్తూరిబా కుష్టు కేంద్రంలో పడింది.

ఆ రోగం మీద, ముందు తనకున్న మూఢనమ్మకాలు పోగొట్టుకోవడం కోసం, పెద్ద పెద్ద పుస్తకాలు చదివింది. సందేహాలుంటే డాక్టర్ల నడిగి తెలుసుకుంది. ఈ పెద్దరోగం అనేది మహా అంటురోగమనే, గత జన్మపాప ఫలితమనే అజ్ఞానంతో నిరాశతో కుమిలిపోతున్న ప్రతి రోగి దగ్గిరా కూచుని వెన్నుతట్టి ధైర్యం చెప్పింది. వేళకు మందులు వేసుకుతీరాలనే స్పృహ కలిగించింది. కండరాలు చచ్చుబడిన కేసుల్ని ఫిజియోథెరపీకి రికమండు చేసింది. అక్కడున్న ఆ కొద్దినెలల్లో ఆ బాధితుల పెదవుల చివరకి చిరునవ్వు చేరింది. రెప్పల్లేని ఆ గాజుకళ్ళల్లో చిరుకాంతి చేరింది.

ఫరవాలేదు, బతికే హక్కు మాకూ ఉన్నట్టుంది అనే ఆశాదీపం ప్రతి హృదయంలో వెలిగింది. కదలలేక కదలలేక అక్కణ్ణుంచి కదిలింది. ఆ ఎడ్యుకేషన్లో అదొక భాగం మాత్రమే అంతకు మించి అక్కడుండడానికి కుదరదు.

రాధ మరోసారి వాచ్ చూసుకుంది.

✪

ఇంకేముంది. ఇంకో అరగంటలో నాన్న వచ్చేస్తాడు. ఈ రాత్రిపూట, ఈ బీచిరోడ్డున, తలుపులు బిగించుకున్న కారులో కూచుని, తన గతమంతా మరోసారి నెమరు వేసుకుంటోంది రాధ.

బ్రీఫ్‌కేస్ తీసి బర్త్ సర్టిఫికేటు మొదలు ఎమ్మే సోషల్ వర్క్ డిగ్రీ వరకూ అన్నీ ఓ ఆర్డర్‌లో ఉన్నాయో లేదో చూసుకుంది. నాలుగు జతల బట్టలూ చేతి ఖర్చుకి ఓ వెయ్యి రూపాయలూ మాత్రమే అందులో ఉంచుకుంది. ఏదేదో చెయ్యాలనుకుంటే ఎన్నెన్నో వదిలేసుకోవాలి మరి. డిగ్రీ సర్టిఫికేటును మరోసారి ఆప్యాయంగా పట్టుకుంది.

ఈ కోర్సు కాదు గాని సొసైటీలోని డార్క్ సైడ్‌ని ఎంత బాగా చూపించింది! ఈ ఎమ్ ఎస్ డబ్ల్యూలో తీసుకోవలసిన సబ్జెక్ట్సు ఎన్నెన్నో ఉన్నాయి. మెడిసిన్ ఎండ్ సైకియాట్రీ అనీ, క్రిమినాలజీ అనీ, ప్రిజన్ ఎన్విరాన్‌మెంట్ అనీ, స్లమ్ స్టడీ అనీ... ఇలా ఎన్నెన్నో... కాస్త తరతమ బేధాలతో అన్ని యూనివర్శిటీల్లోనూ సుమారుగా ఇలాగే ఉంటాయి. వేదనామయ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ ఫీల్డు వర్క్ కన్న దగ్గర దారి లేదు.

కోర్సు పూర్తయిపోతుందనగా ఆమె తన ఫీల్డు వర్కుగా మెంటల్‌కేర్ హాస్పిటల్‌ని ఎంచుకుంది. వాళ్ళ బతుకు దైన్యం, హైన్యం, వెర్రి వేయి విధాలు అనే సామెత అర్థం తెలియాలంటే

ఏ పిచ్చాసుపత్రికైనా వెళ్ళి చూడాల్సిందే. రోగుల మానసిక పరిస్థితిని బట్టి రకరకాల వార్డులు. ఆసుపత్రి సామర్థ్యాన్ని మించి రోగులు వచ్చినా చేర్చుకోక తప్పని పరిస్థితి. రోగం కుదిరి డిశ్చార్జి చేస్తామన్నా తీసుకువెళ్ళని కేసులు ఎన్నో! మానసిక రోగులు ఎప్పుడేం చేస్తారో తెలియని పరిస్థితి గనుక ఈ అవాంఛనీయ సంఘటనకేనా సిద్ధం కావలసి రావడం ఆ సిబ్బంది పెద్ద ఇబ్బంది!

తక్కిన అవలక్షణాలటుంచి పిచ్చివాళ్ళతో పెద్ద పేచీ ఎక్కడంటే వారి శరీర అశుభ్రత, స్నానం చేయించడం మాట దేవుడెరుగు. మలమూత్ర విసర్జనానంతరం ఆయా భాగాలు కడుక్కోవాలనే స్పృహ వాళ్ళలో కలిగించడమే గొప్ప ప్రగతి. ఇక వాళ్ళ జుత్తు కత్తిరించడమనేది యజ్ఞం చేసినంత పని. ప్రతీ మానసిక రోగికీ తిరుపతి మొక్కే.

ఇంతింత గడ్డాలూ, అంతంత మీసాలూ, పెద్దపెద్ద చింపిరి తలలూ వాళ్ళని తలుచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

ఒక మంచిమాట కోసం, ఒక చల్లని చూపుకోసం, వాళ్ళ గురించి ఆలోచించే ప్రేమ ప్రసాదించే ఒకే ఒక్క విశాల హృదయం కోసం వాళ్ళ నిరంతర తపన. ఆ అభద్రతా భావం ముదిరిపోయే కదా వాళ్ళు ఉన్మాదులుగా తయారైనది! సైకాలజీ, సైకియాట్రీ ఎప్పుడో ఈ మూలాన్ని పసిగట్టేయి. భౌతికంగా సంక్రమించే ఏ వ్యాధి కన్నా అందుకే ఈ మానసిక వ్యాధుల నివారణ అంత కష్టం.

అయినా అంకిత భావంతో పనిచేసే రాధలాంటి వాళ్ళని ఎలాంటి క్లిష్ట పరిస్థితులూ ఎదిరించలేవు. అక్కడ అడుగుపెట్టిన నెలదాటకుండానే అన్ని వయసుల వారిచేతా అమ్మా అని పిలిపించుకోగల ఉన్నతస్థాయికి ఆమె ఎదిగింది.

తీరా కోర్సు పూర్తయి రికార్డు సబ్మిట్ చేసి థీరీలో ప్రాక్టికల్స్‌లో బాగా మంచి మార్కులు సంపాదించుకొని డిగ్రీ చేతికొచ్చేసరికి రాధలో చెప్పలేని అశాంతి ఆలజడీ పట్టుకున్నాయి. తను ఫీల్డు వర్క్ చేసింది అవన్నీ వివరంగా రాసి కేవలం మార్కులు తెచ్చుకోడానికేనా? జ్ఞానం అనేది ఓ కాగితమ్ముక్క ఫ్రేం కట్టించి గోడకి వేళ్ళాడదీసుకోడానికేనా? వాళ్ళ కష్టాలూ, కన్నీళ్ళూ కొంతవరకైనా అర్థమయ్యాయి. మంచిదే. నేనున్నానని వాళ్ళకి చెప్పడం కేవలం తాత్కాలికమేనా!

రాధ ప్రేమను అందుకున్న బాధితులే కాదు. ఆమె కర్తవ్య నిష్ఠని గుర్తించిన యూనివర్సిటీ స్టాఫ్ కూడా ఆమెనెంతో అభినందించారు. ఆ సందర్భంలోనే నేటి స్త్రీ ఎదుర్కొనే సమస్యలూ, వాటి పరిష్కారాలూ పేరున సోషియాలజీ డిపార్టుమెంట్ వాళ్ళు సోషల్ వర్క్ డిపార్టుమెంట్ వాళ్ళతో కలసి ఓ సెమినార్ నిర్వహించారు.

పై రాష్ట్రాల వాళ్ళే కాక ఒకరిద్దరు విదేశస్థులు కూడా అందులో పాల్గొన్నారు. తను ఈ రెండేళ్ళూ కూలంకషంగా అధ్యయనం చేసిన విషయం గనుక అందులో ఎంతో చురుకుగా పాల్గొంది రాధ. ఆ విషయంలో ఆమె సమర్పించిన పరిశోధన పత్రాలు అందర్నీ మెప్పించాయి.

సెమినార్ పూర్తయిన ఆఖరు రోజున తాజ్ రెసిడెన్సీ నుంచి ఆమెకి ఫోన్ కాల్ వచ్చింది.

ఓ ప్రముఖ వ్యక్తి ఆమెని కలుసుకోగోరుతున్నారని, అక్కడ బస చేసిన వాళ్ళు విదేశస్థులు.

ఆ సబ్జెక్ట్‌లో తలలు పండి డైరెక్టరు హోదాలో ఉద్యోగాలు వెలిగిస్తున్న వాళ్ళు ఎందుకు పిలిపించినట్టో! టైము ఫిక్స్ చేసుకుని ఎపాయింట్‌మెంట్ వేళకి అతన్ని కలుసుకుంది.

ఇంతా చేస్తే అతను తెలుగువాడు! నెల్లూరి నుంచి, వాళ్ళ తాతగారి కాలం నాడే వెళ్ళిపోయి దేశాలు పట్టిపోయారుట, ఉద్యోగాల కోసం. తెలుగంటే చాలా ఇష్టం గాని అది ఏ మాత్రం అతనికి సరిగా రాదని అతని మాటలబట్టే పోల్చుకుంది రాధ. అతని వయస్సు అరవై దాటిందని అతన్ని చూసినవాళ్ళెవరూ నమ్మరు.

ప్రస్తుతం సింగపూర్‌లో 'యాక్షన్ ఎయిడ్' అనే సంస్థకి డైరెక్టర్‌గా ఉంటున్నాడుట.

వాళ్ళిద్దరి సంభాషణ అంతా ఇంగ్లీషులోనే నడిచింది. "ఈ సబ్జెక్ట్‌ని ఇంత బాగా అర్థం చేసుకొని, ఇంత గొప్పగా ప్రెజెంట్ చేసిన వాళ్ళని నేను చూళ్ళేదు. మీ ఉపన్యాసం వింటూంటే నన్నే సిగ్గుపడేలా చేసింది. సమస్త స్త్రీ జాతికీ చెయ్యెత్తి మొక్కాలనిపించింది. మీకు మరోసారి నా హృదయపూర్వక అభినందనలు."

అనుకోని ఈ ప్రశంస ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఆకాశానికెత్తింది.

ఈ రెండేళ్ళలో ఇవన్నీ తెలుసుకుంది గాని అంతకుముందు తనకి మాత్రం ఏం తెలుసునని! కుష్టురోగుల వార్డుకీ, పిచ్చాసుపత్రికీ పైకి కనపడేవి తక్కిన సంఘంతో సంబంధం లేకుండా కట్టబడిన పెద్ద పెద్ద గోడలే!

ఆ గోడల అవతలివైపు అభాగ్యుల గోడు ఏమిటో ఇవతలి వాళ్ళకేమైనా తెలుసా! ఏదో అవకాశం వచ్చి తెలుసుకుందిగాని అక్కడ కూడా మనలాంటి మనుషులే ఉంటారనీ, ఎంతటి దౌర్భాగ్యస్థితిలో ఉన్న మనిషికైనా చచ్చేదాకా ఆశ చావదనీ, చేయూత అవసరమనీ, తనకైనా నిన్నో మొన్నో కదా తెలిసింది!

అందునా ఆడవాళ్ళు! అందులో బీదవాళ్ళు! ఈ రెండూ కలిసినచోట వాళ్ళకి జరిగే రకరకాల దోపిడీ వేరే అడగాలా? ఆయా సంస్థల్లోంచి డిశ్చార్జి అయిన స్త్రీల మాటేమిటి? వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడి బతికేలా ఎలాంటి పునరావాస కేంద్రాలు స్థాపించాలి? వీటిమీదే ఆమె ఆనాడు పరిశోధనా పత్రం చదివింది.

"మరొకదానికి మీరు నన్ను క్షమించాలి" అంటూ ఆ అపరిచితుడు మొదలెడితే రాధ మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది.

"ఎందుకంటే యూనివర్శిటీ నుంచి మీ ఎడ్యుకేషన్ రికార్డంతా తెప్పించి చూశాను. మీలాంటి కేండిడేటు కోసం మా సంస్థ స్త్రీ జనోద్ధరణ సంఘం ఎప్పట్నుంచో చూస్తోంది. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని చీఫ్ ఆర్గనైజరుగా ఎపాయింట్ చేస్తాం. మంచి జీతము, కారూ, బంగళా అన్నీ ఉంటాయి. మీరు సింగపూర్‌లోనే వర్క్ చేయవలసి ఉంటుంది. మా రిహేబిలిటేషన్ సంస్థ ఇంకా

ఇక్కడ మూడురోజులు ఉంటుంది. ఈలోగా మీరు మీ అంగీకారం తెలియజేయవలసి ఉంటుంది. ఓకే?"

అన్నీ విని ఇంటికొచ్చింది గాని ఆ మూడురోజులూ ఆమె కంటి మీద కునుకులేదు. ఆడదాని మీద అతి చిన్నచూపుగల అహంకారి తన తండ్రి. తనని విదేశంలో ఉద్యోగం చెయ్యనిస్తాడా! అలాగని ఇంత మంచి అవకాశం వదులుకోగలదా! త్వరత్వరగా ఆమె ఓ నిర్ణయానికి వచ్చేసింది.

తన ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ అడక్కపోతేనే ఉద్యోగంలో చేరతానని కండిషన్ పెట్టింది. వాళ్ళకి చెప్పి ఒప్పించింది. మూడోరోజు రాత్రి రైలు స్టేషన్‌కొచ్చి ఆ పార్టీని కలుస్తానని చెప్పింది. రాధ వాచీ చూసుకుంది.

తొమ్మిదిన్నర, బ్రీఫ్‌కేసు పట్టుకు దిగిపోయింది. కార్ లాక్ చేసి తాళాలు సముద్రంలోకి విసిరేసింది. తన తండ్రిని కాదనడానికి ఇంతకంటే మంచి మార్గం లేదు. తన లక్ష్యమే తనకి ముఖ్యం. ఆటోని ఆపి అందులో కూచుని రైలుస్టేషన్‌కి తీసుకెళ్ళమంది.

★